కానరాని దీపావళి సందడి

- ఆర్థిక ఇబ్బందులే కారణమా?
- పర్యావరణ చైతన్యమూ కారణమే

మూడు దశాబ్దాల కిందట ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం వద్ద బాణసంచా దుకాణాలు ఏర్పాటయ్యేవి. నగర పరిధిలోని వారంతా అక్కడికే వెళ్లి కావలసిన బాణసంచా తెచ్చుకునేవారు. తర్వాత జీవీఎంసీ కార్యాలయం సమీపంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటయ్యేవి. ప్రస్తుతం ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్ వేదికగా బాణసంచా విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో దక్షిణలో దీపావళి సందడి తగ్గిపోయింది. అలాగే ఒకే నెలలో వచ్చిన దసరా, దీపావళి వల్ల ఆర్థిక భారం వల్ల కూడా ఈసారి దీపావళి సందడి నియోజకవర్గంలో అంతగా కనిపించడంలేదు.

డాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధిలో దీపావళి సందడి కనిపించడంలేదు. మచ్చుకైనా.. చిటపటలు పేల్లేదు. తారాజువ్వల సందడి కాన రాలేదు. చిచ్చుబుడ్డిల హడావిడి కనిపించకుండా పోయింది. బాణసంచా బావురుమంటోంది. కమ్మరేకుల బాంబులు సైలంటయ్యాయి. పర్యావరణ పరిరక్షణో.. కాలుష్య కారణమో తెలీయదు గానీ.. నియోజకవర్గ పరిధిలో ఈ ఏట దీపావళి సందడి మందకొడిగా ఉంది. ప్రతి దీపావళికి వారం రోజుల ముందుగానే వచ్చే సందడి ఈ దీపావళికి కనిపించలేదు. అసలే అమావాస్య.. చీకటి నెలకొన్న నేపథ్యంలో బాణసంచా వెలుగుల్లో కనిపించే ఈ ప్రాంతానికి ఏమైందో.. ఎక్కడా వెలుగులు కనిపించడం లేదు.

గతంలో..

దీపావళి పండగ వచ్చిందంటే చాలు.. వారం పది రోజులు ముందుగానే దక్షిణ నియోజకవర్గానికి పండగ వచ్చేది. మూడు దశాబ్దాల కిందట ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం ప్రహరీకి ఆనుకుని వందకు పైగా స్టాల్స్ ఉండేవి. నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో అక్కడ స్టాల్స్‌కు అనుమతి ఇవ్వలేదు. రెండు దశాబ్దాల కిందట నియోజకవర్గ పరిధి ఎల్ఐసీ వెనుక భాగంలో స్టాల్స్‌కు అనుమతి ఇచ్చేవారు. ఆ తర్వాత అక్కడి నుంచి జీవీఎంసీ గాంధీ పార్కు.. వైఎస్సార్ పార్కు చుట్టూ స్టాల్స్ ఏర్పాటు చేసేవారు. దక్షిణ నియోజకవర్గ పరిధి నుంచి స్టాల్స్ దూరం కావడంతో ఆ సందడి కాస్త తూర్పు నియోజకవర్గానికి వెళ్లింది. ప్రస్తుతం ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్ వేదికగా బాణసంచా విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో దక్షిణ సందడి.. తూర్పుకి తరలిపోయినట్టయింది.



విద్యుత్ లైట్ల కొనుగోలుకు క్యూ కట్టిన ప్రజలు

ఆర్థిక ఇబ్బందులే కారణమా..

ఒకే నెలలో రెండు పండగలు రావడం. ఆపై ఆర్థిక భారం అధికమవ్వడమే కారణమనిపిస్తోంది. ఈ నెల 12న దసరా పండగ రావడం.. నెల చివర్లో దీపావళి పండగ రావడంతో కొంత ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో దీపావళి పండగకు చాలా మంది దూరంగా ఉన్నట్టు తెలుస్తోంది. మతాబులు..బాణసంచా కాల్చకుండా.. మట్టి ప్రమిదలు.. ఎలక్ట్రిక్ లైట్లతోనే ఈ ఏటా దీపావళి పండగకు ప్రాధాన్యమిస్తున్నట్టు తెలుస్తోంది.

పర్యావరణ పరిరక్షణా? కాలుష్యమా?

స్వచ్ఛంద సంస్థలు.. విద్యా సంస్థలు దీపావళి పండగను జరుపుకోవాలని చెబుతూ.. ఎటువంటి మతాబులు.. తారాజువ్వలు.. బాణసంచా కాల్చి వాతావరణాన్ని పొల్యూట్ చేయకండంటూ విద్యార్థులకు సూచించడంతో చాలా మంది పిల్లలు వాటికి దూరంగా ఉంటున్నారు. మొక్కుబడిగా ఈ దీపావళి పండగను చేసేందుకే సిద్ధమయ్యారు.

ప్రమిదలకే గిరాకీ..

బాణసంచా.. మతాబులు కాల్చేందుకు దూరంగా ఉంటున్న నియోజకవర్గ ప్రజలు దీపావళి ప్రమిదలపై మొగ్గు చూపారు. ప్రమిదల వెలుగులతోనే దీపావళి పండగ చేసుకునేందుకు ఆసక్తి చూపడంతో మట్టి ప్రమిదలకు గిరాకీ పెరిగింది. మట్టి ప్రమిదలతో పాటు డిజైనర్ ప్రమిదలు కూడా మార్కెట్లో విరివిగా లభిస్తున్నాయి.



ట్రాఫిక్ సమస్య వద్దు.. హెల్మెట్ కేసులే ముద్దు





పూర్ణామార్కెట్ వద్ద ఒక వైపు ట్రాఫిక్ జామ్, ఇంకో వైపు దుర్గాలమ్మ గుడి రోడ్డు మీద పార్కింగ్‌తో రద్దీ వాతావరణం ఏర్పడింది. అయితే దీన్ని పట్టించుకోకుండా పోలీసులు హెల్మెట్ కేసుల్లో బిజీగా గడిపారు. ట్రాఫిక్ జామ్‌తో వాహన చోదకులు ఇక్కట్లు పడుతున్న విషయం పట్టించుకోలేదు. పండగ సమయం కావడంతో రోడ్లు రద్దీగా ఉన్నాయి. ట్రాఫిక్ సమస్యలపై పోలీసులు దృష్టి సారించాలని ఈ సందర్భంగా ప్రజలు కోరుతున్నారు.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చిరుజల్లులు ఒకచోట.. మండే ఎండ మరోచోట





జగదాంబ జంక్షన్‌లో మంగళవారం ఒకేసారి విభిన్న వాతావరణం కనిపించి అంతా ఆశ్చర్యానికి గురయ్యారు. ఒక చోట చిరు జల్లులు, ఒక చోట ఎండ వేడిమి నమోదు అయ్యాయి.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కాఫీ ఆర్గానిక్ సర్టిఫికేషన్‌ను విస్తరించాలి



మాట్లాడుతున్న ఎండీ కల్పనాకుమారి

మహారాణిపేట: గిరిజన సహకార సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం 'కాఫీ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ప్రక్రియను పాడేరు ఏజెన్సీలోని ఇతర మండలాలకు విస్తరించడం' అనే అంశంపై ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఉన్నతాధికారులతో గిరిజన సహకార సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటికే చింతపల్లి, జి.కె.వీధి మండలాల్లో 2600 మంది కాఫీ రైతులకు చెందిన 2258.55 హెక్టార్లలో కాఫీ, మిరియాల పంటలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ లభించిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ప్రక్రియను ఏజెన్సీ ప్రాంతంలో ఇతర మండలాలైన పాడేరు, అరకు, అనంతగిరి, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచింగ్‌పుట్టు, జి.మాడుగుల, చింతపల్లి, జి.కె.వీధి, కొయ్యూరు మండలాల్లో గల 1,25,928 మంది కాఫీ రైతుల 91,671.95 హెక్టార్లలో గల కాఫీ తోటలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ చేయవలసిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటీడీఏ పీడీ అభిషేక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ, గుంటూరు క్వాలిటీ మేనేజరు డాక్టర్ జి.యుగంధర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.పి. నాయుడు, పాడేరు కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ ఎస్. రమేష్, ఐటీడీఏ పీడీ ఎ.పి.ఒ. (పి.టి.జి.) వెంకటేశ్వరరావు, ఆర్.వి. నగర్ రీజినల్ కాఫీ రీసెర్చ్ స్టేషన్ అధికారి సునీల్ బాబు, టెక్నో సర్వ్ విశాఖపట్నం మేనేజర్ బిరుల్ పాండా, గిరిజన వికాస్ (స్వచ్ఛంద సంస్థ) జి.కె.వీధి సెక్రటరీ ఎస్.వి. సత్యనారాయణ , గిరిచేతన (స్వచ్ఛంద సంస్థ) జి.కె.వీధి వి.సి.అలివేణి, గిరిజన సహకార సంస్థ, విశాఖపట్నం కాఫీ విభాగం జనరల్ మేనేజర్ ఎం.వి.వి.ఎస్. ఉమాదేవి, సీనియర్ మేనేజరు టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువలు శుభ్రం చేయాలి



దుర్గాలమ్మ జంక్షన్ వద్ద కాలువలో పూడిక తీయిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు



దుకాణదారుడికి అపరాధ రుసుము విధిస్తున్న జెడ్సీ

జగదాంబ: మురుగు నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా కాలువలను పరిశుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్-4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. మంగళవారం 29, 35 వార్డుల్లోని కాలువలను పరిశీలించారు. జోన్ పరిధిలో అన్ని వార్డుల్లో ప్రధాన కాలువలను ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు లేకుండా పరిశుభ్రం చేయాలని వార్డు ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులకు ఆదేశించారు. రహదారులన్నీ పరిశుభ్రంగా కనిపించాలని కార్యదర్శులకు ఆదేశించారు. రహదారి పక్కన చెత్త కుప్పలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వార్డులో క్లాప్ వాహనాల చెత్త సేకరణను పరిశీలించారు. ఒక్కో క్లాప్ వాహనం 650 కేజీల పైగా చెత్తను యార్డుకు తరలించాలన్నారు. వాణిజ్య సముదాయాల వద్ద చెత్త డబ్బాలు తప్పనిసరిగా ఉండాలని జెడ్సీ మల్లయ్యనాయుడు అన్నారు. మంగళవారం 35వ వార్డు పూర్ణామార్కెట్ వద్ద పర్యటించిన ఆయన దుకాణాల వద్ద డస్ట్‌బిన్‌లు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. దుకాణదారులకు అపరాధ రుసుము విధించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కెమిస్ట్రీ ల్యాబ్‌లు, ఆటస్థలాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్లే గ్రౌండ్, ఫర్నిచర్ లేని పాఠశాలల వివరాలు సేకరించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ)పై వివిధ ప్రభుత్వ శాఖలు, మండల విద్యాశాఖ అధికారులు, పీఎంశ్రీ స్కూల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా ప్రోగ్రామ్ కింద 5 పాఠశాలలను గుర్తించినట్లు తెలిపారు. ఈ పాఠశాలలకు కెమిస్ట్రీ ల్యాబ్‌లు, ప్లేగ్రౌండ్లు, పాఠశాలల నిర్వహణకు కాంపోజిట్ స్కూల్ గ్రాంట్ విడుదల జరిగిందన్నారు. కెమిస్ట్రీ ల్యాబ్‌లు, ప్లేగ్రౌండ్లు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ శాఖను ఆదేశించారు. అలాగే నిర్దేశించిన విధంగా 5 పాఠశాలల్లో తాగునీరు. టాయిలెట్లు, ఫర్నిచర్, ఇంటర్నెట్, ల్యాబ్‌లు తదితర 21 రకాల వసతులు తప్పనిసరిగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్, జిల్లాస్థాయి అధికారులు, అసిస్టెంట్ ఏఎంవో లక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు, పిఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి కేసులోనిందితుడి అరెస్ట్

తాటిచెట్లపాలెం: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయి ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాకు చెందిన అనిల్ మచ్చను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి తరలించేందుకు రెక్కీ నిర్వహిస్తుండగా ఆర్పీఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని జీఆర్పీ సిబ్బందికి అప్పగించారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

క్లుప్తంగా

ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై జేసీ సమీక్ష



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: అర్హులైన పేద కుటుంబాలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమంపై జిల్లా జాయింట్ కలెక్టర్ పి.మయూర్ అశోక్ మంగళవారం సమీక్షించారు. ఈ పథకం కింద అర్హులను గుర్తించడానికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆధార్ నంబర్‌తో లింకు చేయబడిన బ్యాంకు ఖాతా అకౌంట్ నంబరు, గ్యాస్ కనెక్షన్ నంబర్ ఇవ్వాలని తెలిపారు. ఈ పథకం కింద ప్రయోజనం పొందగోరు లబ్ధిదారులు తమ గ్యాస్ ఏజెన్సీలో బుక్ చేసుకోవాలన్నారు. గ్యాస్ తీసుకున్న 48 గంటల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని జేసీ వివరించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో భాస్కరరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ వారోత్సవాల నిర్వహణ



యువతకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రఘురామ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ మోహన్

సీతమ్మధార: అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ద్వారకానగర్, దొండపర్తి, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్‌లోని పలు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు సంచార వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువత అవినీతి నిరోధ చర్యలకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. శివాజీపాలెంలోని రఘురామ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ కె.మోహన్ అవినీతి నిరోధక వారోత్సవాల్లో పాల్గొన్న యువతకు సర్టిఫికెట్లు అందజేశారు.

బీసీలకు అందాల్సిన పథకాల కోసం కృషి



పెబ్బిలికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

డాబాగార్డెన్స్: ప్రభుత్వం నుంచి బీసీలకు అందాల్సిన పథకాల కోసం తాను కృషి చేస్తానని రాష్ట్ర బీసీ నాయకుడు, రాష్ట్ర గాండ్ల తెలుకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పెబ్బిలి రవికుమార్ తెలిపారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆయన జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులు, బీసీ సంఘాల నాయకులు పెబ్బిలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెబ్బిలి మాట్లాడుతూ కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ బీసీల సంక్షేమానికి పని చేస్తానన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవాన్ని ఆటోలో తరలిస్తున్న కందుల నాగరాజు తదితరులు

అల్లిపురం: రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలోని ఫుట్‌పాత్‌పై అనాథ శవం ఉందని మంగళవారం సాయంత్రం స్థానికులు, పోలీసుల ద్వారా తెలుసుకున్న 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా సహాయం చేసేందుకు తాను సిద్ధంగా ఉంటానని తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



సతీష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: తోటి వారికి సాయం చేస్తూ గుండెపోటుతో ప్రాణం విడిచిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, కురుపాం మార్కెట్ మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు పోలవరపు సతీష్ కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. 39వ వార్డు కోటవీధి కన్వేయర్ బెల్ట్ ప్రాంతంలో నివాసముంటున్న ఆ కుటుంబాన్ని వాసుపల్లి మంగళవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యుడిగా ఎంతో మందికి సాయం చేస్తూ, తోటి వారికి ఆదర్శంగా నిలిచారన్నారు. అటువంటి మంచి వ్యక్తి పోలవరపు సతీష్, ఇతరుల అప్పులకు ష్యూరిటీగా ఉండి ఆర్థిక ఇబ్బందులు తాళలేక గుండెపోటుతో మరణించడం బాధాకరమని, ఆ కుటుంబానికే కాక పార్టీకి తీరని లోటని వాసుపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడు సతీష్ కుమార్తె క్యాంపస్ ఇంటర్వ్యూకి వెళ్లే టూర్ ఖర్చులు, అలాగే తన వివాహ వేడుకలకు కూడా ఆర్థిక సాయం చేసి ఆ కుటుంబానికి అండగా నిలుస్తానని వాసుపల్లి భరోసా ఇచ్చారు. కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, నియోజకవర్గ మైనార్టీ నాయకుడు ముజీబ్‌ఖాన్, పార్టీ నాయకులు బాబ్జి, కృష్ణ, సలీం , రాజేష్, మాధురి, రమణమ్మ, ధనరాజు, ఆది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల దీపావళి సంబరాలు



దీపావళి సంబరాల్లో చిన్నారులతో కొల్లి సింహాచలం, శ్రీలక్ష్మి తదితరులు

డాబాగార్డెన్స్: పాతనగరంలో బాల బాలికలతో దీపావళి సంబరాలు మంగళవారం వేడుకగా సాగాయి. వేదాంత (వీజీసీబీ), ఆస్ప్రో యాక్షన్ ఫర్ ఫుడ్ ప్రొడక్షన్ సంయుక్తంగా పాత నగరం ఫిషరీస్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన ఈ సంబరాల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కొల్లి సింహాచలం పాల్గొని చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణకుమారి, వేదాంత సీఎస్ఆర్ హెడ్ (పీఆర్) జేఎస్ శ్రీలక్ష్మి, యాక్షన్ ఫర్ ఫుడ్ ప్రొడక్షన్ ప్రాజెక్టు మేనేజర్ విజయ భాస్కర్, కో ఆర్డినేటర్ వై. అశోక్‌కుమార్, అనిల్, ఆశ, సాయి, బాల బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



ఆయుస్సు హోమం నిర్వహిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుస్సు హోమం..

ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజున కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహించే ఆయుస్సు హోమం మంగళవారం నిర్వహించారు. దేవస్థాన వేద పండితులు, అర్చక స్వాములు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈవో, ఏఈవో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దామోదర తిరువీధి ఉత్సవం



దామోదర కీర్తనలు ఆలపిస్తూ నేరెళ్లకోనేరు వైపు సాగిపోతున్న ఒడిషా భక్తులు

అల్లిపురం: నేరెళ్లకోనేరులో గల ఒడియా కుటుంబాల ఆధ్వర్యంలో కార్తీక దామోదర మాస వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారు జామున దామోదరునికి ప్రీతిపాత్రమైన శ్రీకృష్ణ భగవానుని కీర్తనలు పాడుతూ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఆశ్వయుజ పౌర్ణమి నుంచి కార్తీక పౌర్ణమి వరకు తిరువీధి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నేరెళ్ల కోనేరు, చలువతోట, అల్లిపురం మెయిన్‌రోడ్డు, చావులమదుం, మార్కెట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కీర్తనలు ఆలపిస్తూ ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళల్లో ఇళ్ల ముందు కార్తీక దామోదర దీపాలు వెలిగించి పూజలు చేస్తున్నారు.

వచ్చే నెలలో సంతోష్ ట్రోఫీ లీగ్ పూల్ మ్యాచ్‌లు

విశాఖ స్పోర్ట్స్ : సంతోష్ ట్రోఫీలో భాగంగా నవంబర్ 15 నుంచి 19 వరకు ఆంధ్రప్రదేశ్ ఆడే గ్రూప్ పూల్ మ్యాచ్‌లు అనంతపురంలో జరగనున్నాయి. ఈ పూల్‌లో ఏపీతో పాటు మరో మూడు జట్లు ఆడనున్నాయని విశాఖ జిల్లా ఫుట్‌బాల్ అలయెన్స్, వెల్ఫేర్ సంఘం (వీడీఎఫ్ఏ) కార్యదర్శి ఎ.చినబాబు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐఎఫ్ఎల్ టోర్నీలో ఏపీ తరఫున గతేడాది కోరమాండల్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు పాల్గొందని తెలిపారు. వాస్తవానికి హైదరాబాద్ నుంచి ఐఎఫ్ఎల్‌కు మరో జట్టు ప్రాతినిథ్యం వహిస్తుండటంతో ఏపీ తరఫున శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ విశాఖలో ఫుట్‌బాల్ మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామంటూ గతంలో లైసెన్స్ తీసుకున్నది వాస్తవమేనన్నారు. ఎస్ఎఫ్ఎల్ కార్యకలాపాలు హైదరాబాద్‌లోనే ఉండటంతో, ప్రత్యామ్నాయంగా విశాఖలో కోరమాండల్ ఫుట్‌బాల్ క్లబ్‌ను ఆ స్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఏపీలో మేటి క్లబ్‌లకు పోటీలు నిర్వహించి విజేత జట్టును ఐఎఫ్ఎల్‌కు పంపాల్సి ఉంటుందన్నారు.